# మాటిచ్చి.. సిరుల సిరిసిల్లగా మార్చి..
# ప్రజా ఆశీర్వాదం కోసం..

## నేడు కార్మికక్షేత్రానికి ప్రగతి ప్రదాత కేసీఆర్

కరీంనగర్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ) : సమైక్య రాష్ట్రంలో ఆకలి చావులు, ఆత్మహత్యలకు కేరాఫ్‌గా ఉన్న సిరిసిల్లను సిరుల సిల్లాగా మార్చుతామంటూ తొమ్మిదేళ్ల కింద ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన మాటలు నేడు కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి. ఈ గడ్డపై నుంచి ఇచ్చిన ప్రతి హామీని వందశాతం అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కితే, అంతకుమించి అభివృద్ధిని పరుగులు పెట్టించి అగ్రభాగంలో నియోజకవర్గాన్ని నిలబెట్టిన ఘనత కేటీఆర్‌కు దక్కింది. 2014లోనే ముఖ్యమంత్రి చెప్పిన మాటలను ఒక్కసారి లోతుగా పరిశీలిస్తే.. సిరిసిల్ల నియోజకవర్గంపై ఆయనకు ఉన్న ప్రేమతోపాటు దూరదృష్టి ఎంత ఉన్నదో అర్థం అవుతుంది. సమైక్య రాష్ట్రంలో నేతన్నల ఆత్మహత్యలను కండ్లారా చూసి చలించిన కేసీఆర్, సీఎం కాకముందే అంటే 2014 ఎన్నికల సమయంలోనే వారిలో మనోనిబ్బరం నూరిపోశారు. 'నేతన్నల్లారా.. మీరు ఆత్మహత్యలు చేసుకోవద్దు.. బంగారు తెలంగాణ చూసేందుకు బతికి ఉండాలి' అని ఆనాడే కేసీఆర్ పిలుపు నిచ్చారు. మాట ఇచ్చినట్టుగానే నేతన్నలకు అన్ని రకాలుగా అండగా నిలిచారు. లక్ష వరకు రుణమాఫీ చేశారు. నేతన్న బీమాతో.. ఈ వృత్తినే నమ్ముకున్న కుటుంబాలకు ధీమానిచ్చారు. నాటి పాలనలో కుదేలైన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు జీవం పోసి, ఉపాధికి భరోసాకల్పించారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, రంజాన్, క్రిస్మస్ వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లతో చేతినిండా పనికల్పిస్తున్నారు. సిరిసిల్ల బ్రాండును వివిధ దేశాల్లో విక్రయించే స్థాయికి చేర్చారు. అంతేకాదు, ఈ ప్రాంతంలోని బీడీ కార్మికులకు ఇచ్చిన భృతి హామీని వందకు వంద శాతం అమలు చేశారు. మరో విశేషం ఏమిటంటే.. రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించి తీరుతానంటూ ఆనాడే చెప్పడాన్ని చూస్తే.. సీఎం కాకముందే ఈ ప్రాంతంపై ఎంత పట్టున్నదో తెలుస్తున్నది. కాళేశ్వరం జలాలను ఎలా తరలించి మెట్ట ప్రాంతాలను అభిషేకించవచ్చో ఆనాడే విప్పి చెప్పిన ఆయన, ఆచరణలో చేసి చూపించారు. కరువుతో తండ్లాడిన సిరిసిల్లను కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం చేశారు. నాడు సమైక్య పాలనలో మధ్యలో వదిలేసిన శ్రీరాజరాజేశ్వర జలాశయాన్ని పూర్తి చేయించారు. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు ఎండిపోయిన ఎగువమానేరు జలాశయాన్ని ఎండకాలంలోనూ నిండుకుండలా మార్చారు. ఇటు మానేరు, అటు మూలవాగుపై చెక్‌డ్యాంలు నిర్మిస్తూ, సజీవనదులుగా మార్చుతున్నారు. ఇప్పుడు నెర్రలుబారిన నేలల్లో కాళేశ్వరం జలాలు సవ్వడి చేస్తున్నాయి. భూగర్భ జలాలు ఏకంగా ఆరు మీటర్లపైకి చేరాయి. మరోవైపు భూములన్నీ పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. అలాగే సిరిసిల్లను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని చెప్పినట్టుగానే కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. మంత్రి కేటీఆర్ కృషి మేరకు అడిగినవన్నీ నిధుల ఇస్తూ ప్రగతిని పరుగులు పెట్టించారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఆదర్శంగా నిలిపారు. వ్యవసాయ, ఇంజినీరింగ్, వైద్య, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయించి ఎడ్యుకేషన్ హబ్‌లా మార్చారు.

### నేడు సిరిసిల్లలో ప్రజా ఆశీర్వాద సభ

ఉద్యమాల గడ్డ హుస్నాబాద్ వేదికగా ఆదివారం ఎన్నికల శంఖారావం పూరించిన బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్, సోమవారం జనగామ, భువనగిరిలో ప్రజాశీ ఆశీర్వాద సభలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డులో ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించనుండగా, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి అరకిలోమీటర్ దూరంలో ఉన్నా 25ఎకరాల విశాలమైన స్థలంలో సభాస్థలి సిద్ధం చేశారు. జిల్లా నలుమూలల నుంచి లక్ష మందిని తరలించనుండగా అందుకనుగుణంగా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. సభ ముందు భాగంలో మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేక స్థలం కేటాయించారు. ఎండ తగలకుండా షామియానాలు వేశారు.

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కేటీఆర్

వేములవాడలో సమావేశం ముగిసిన అనంతరం మంత్రి కేటీఆర్, రాత్రి పది గంటలకు సిరిసిల్లలోని సభాస్థలికి చేరుకున్నారు. వేదిక, హెలిప్యాడ్, ప్రజల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, టీఎస్‌టీపీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బొల్లి రాంమోహన్ ఉన్నారు.

### కార్మిక క్షేత్రం గులాబీమయం

సిరిసిల్ల గులాబీమయంగా మారింది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కటౌట్లతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జిల్లా కేంద్రానికి వచ్చే శివారులు, ముఖ్య కూడళ్లలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు పెట్టారు. దారుల వెంట గులాబీ జెండాలు కట్టారు. మరోవైపు అధినేత కేసీఆర్ ఘనస్వాగతం పలికేందుకు మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ముఖ్య నాయకులంతా ఏర్పాట్లు చేశారు. ఆశీర్వాద సభకు గత వారం నుంచే అన్ని మండలాల్లో కార్యకర్తలు, సర్పంచులు, ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులంతా సన్నాహక సమావేశాలు పెట్టి జనసమీకరణకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆధ్వర్యంలో 39 వార్డులకు చెందిన కౌన్సిలర్లు ఇంటింటికీ తిరిగి ఆహ్వానిస్తున్నారు.

### పార్కింగ్ స్థలాలు

సీఎం రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభకు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల నుంచి వచ్చే వాహనాలను రెండో బైపాస్ రోడ్డులోని మెడికల్ కాలేజీ ఎదుట ఐదెకరాల స్థలాన్ని కేటాయించారు. సిరిసిల్లలోని అన్ని వార్డుల నుంచి వచ్చే ప్రజల కోసం మొదటి బైపాస్ రోడ్డులోని నర్సింగ్ కళాశాల వద్ద ఐదెకరాల స్థలం, జిల్లెల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల నుంచి వచ్చే వారికి మానేరు బ్రిడ్జి, అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఖాళీ స్థలం, ఇతర వాహనాల కోసం రంగినేని ట్రస్టు వద్ద 40 ఎకరాల్లో ఏర్పాట్లు చేశారు.

సిరిసిల్ల మొదటి బైపాస్ రోడ్డులో
▼ సీఎం సభా ప్రాంగణం



#### బంగారు తెలంగాణ చూసేందుకు బతికి ఉండాలె

సిరిసిల్ల ఒకనాడు సిరులకు నిలయంగా ఉండేది. కానీ, సీమాంధ్రుల పాలనలో అది ఆత్మహత్యలు, ఆకలి చావులకు కేరాఫ్‌గా మారింది. అరవై ఏండ్ల పాలనలో ఏమి జరిగిందో నాకు తెలుసు. నేను కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు సిరిసిల్లలో ఒకే రోజు ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం చూసి చలించిపోయిన. అదే సమయంలో పార్టీ నిధి నుంచి ₹50 లక్షలు ఇచ్చి కొంత మేరకు ఆదుకున్న. దీనికి శాశ్వత పరిష్కారం కల్పించే అవకాశం ఇప్పుడు మనకు వచ్చింది. ఒక్క మాట గట్టిగా చెబుతున్న. చేనేత కార్మికుల్లారా.. బిడ్డల్లారా మీరెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు. బంగా రు తెలంగాణ చూసేందుకు బతికి ఉండాలని వేడుకుంటున్న. మీకు సంబంధించిన ప్రభుత్వ అప్పులను బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకుంటం. ఈ విషయంలో ఎవరూ బాధ పడొద్దు.

**- 2014 ఏప్రిల్ 26న సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్**

#### సిరిసిల్ల పరిశ్రమ ఎదగాలె

ఉద్యమ సమయంలో కోరుట్ల నుంచి హైదరాబాద్‌కు రాత్రిపూట సిరిసిల్ల మీదుగా బయలు దేరినం. అప్పుడు ఇక్కడి గోడలపై ఆత్మహత్యలు, చావులు సమస్యకు పరిష్కారం కాదని రాసిన అక్షరాలను చూసి ఏడ్చినం. స్వతంత్ర్య భారతదేశంలో ఇంకా ఈ ఆకలిచావులు ఎందుకని బాధపడ్డం. గత పాలకుల పాలనలో ధ్వంసమైన కులవృత్తులకు సిరిసిల్లనే ఉదాహరణ. నేతవృత్తి చతికిల పడ్డది. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో నేత కార్మికుల బతుకులు బాగుచేయాలని తపన పడ్డం. ఇప్పుడు సిరిసిల్లను చూస్తుంటే సంతోషంగా ఉన్నది. ఆత్మహత్యలు ఆగినయి. కానీ, కార్మికుల సమస్యలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలె. కార్మికుడు ఆసామిగా ఎదగాలె. అపారల్ పార్క్ ద్వారా మహిళలు శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందాలి. ఒక్కో కార్మికుడికి నెలకు ₹30 వేల కూలీ రావాలె. ఇంటిల్లిపాది సంతోసంగా ఉండాలన్నదే నా లక్ష్యం. రామారావు ఆధ్వర్యంలో ఆ దిశగా పని జరుగుతున్నది. రామారావు చాలా ఉత్సాహంతో పనిజేస్తుం డు. అమెరికా మార్కెట్‌లో సిరిసిల్ల బ్రాండ్ ఉండేలా పరిశ్రమ ఎదగాలె.

**- 2018 నవంబర్ 20న సిరిసిల్లలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్**



తెలంగాణ భవన్ ప్రాంగణంలో ఎన్నికల ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, కేకే

# రామన్నకే జై

- సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు
- మంత్రి చొరవతో మానేరుకు ఎదురెక్కిన గోదావరి జలాలు
- బతుకమ్మ చీరెల ఆర్డర్లతో నేతన్నల జీవితాల్లో వెలుగులు
- గ్రామగ్రామాన వెల్లువెత్తుతున్న అభిమానం
- మరోసారి భారీ మెజార్టీ అందిస్తామంటూ తీర్మానాలు

**సిరిసిల్ల అంటే మెట్ట ప్రాంతం.. పడావుపడ్డ భూములు.. ఇంకిపోయే బోర్లు.. సాగునీటి కోసం తండ్లాడే రైతాంగం.. మరోవైపు వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు.. ఇది సమైక్య పాలకులు మిగిల్చిన విషాదం.. అన్నదాత, నేతన్న ఆక్రందనలు చూసిన తెలంగాణ సర్కారు ఈ ప్రాంత ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించింది. సీఎం కేసీఆర్ సహకారం, మంత్రి కేటీఆర్ చొరవతో కాళేశ్వర గంగ మానేరుకు ఎదురెక్కడంతో బీడు భూముల్లో రైతాంగం బంగారు పంటలు పండిస్తున్నది. అలాగే బతుకమ్మ చీరెల ఆర్డర్లతో నేతన్నల జీవితాలకు భరోసా దొరికింది. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన అమాత్యుడి రామన్నవైపే ప్రజానీకం నిలుస్తున్నది. ఎన్నికల వేళ జైకొడుతూ అభిమానం చాటుకుంటున్నది. ఇప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా.. మరోసారి భారీ మెజార్టీ అందిస్తామంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నది.**

**- రాజన్నసిరిసిల్ల, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)**

కరవు, కాటకాలు, దుర్భిక్షంతో అల్లాడిన మెట్ట ప్రాంతం సిరిసిల్ల నేడు సుభిక్షంగా మారింది. మంత్రి రామన్న చొరవతో శ్రీ రాజరాజేశ్వర జలాశయం, అన్నపూర్ణ ప్రాజెక్టు, మల్కపేట రిజర్వాయర్ పూర్తి కాగా, కాళేశ్వరం జలాలతో జలాశయాలు, చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. నాడు రాళ్లు, రప్పలతో సాగుకు నోచుకోని భీడు భూముల్లో నేడు కాళేశ్వరం జలాలతో రైతాంగం బంగారు పంటలు పండిస్తున్నది. పెరిగిన దిగుబడితో రైతుల ఇంట ధాన్యపు సిరులు కురిసింది. ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములు ఏర్పాటు చేసింది. గిట్టుబాటు ధరతో అన్నదాతకు ఆదాయం పెంచింది. రైతుబంధు, రైతు బీమా, రైతు వేదికలు ఏర్పాటు చేసి రైతులకు బాసటగా నిలిచింది.

### నేతన్నల జీవితాల్లో వెలుగులు

వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి కరువై మర నేతన్నలు దారాలనే ఉరితాళ్లు చేసుకుని ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఏ వార్డులో చూసినా చనిపోయిన నేతన్నల దృశ్యాలు, కుటుంబ సభ్యుల రోధనలు ఇది నాటి సమైఖ్య పాలనలోని పరిస్థితి. స్వరాష్ట్రంలో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మైక్రో, శేర్‌ముల్లా ఫైనాన్స్ ఉచ్చులో కూరుకుపోయిన నేత కార్మికులకు మంత్రి కేటీఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేయించారు. 904మంది నేత కార్మికులకు రూ.3.70కోట్లు మాఫీ చేయించారు. రాష్ట్రంలోని తెల్లకార్డు మహిళా లబ్ధిదారులకు బతుకమ్మ కానుకగా చీరెలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి అమలు చేయించారు. ఏటా రూ.350కోట్ల బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్లు, క్రిస్మస్, రంజాన్ దుస్తుల తయారీ ఆర్డర్లు సిరిసిల్లకే ఇప్పించారు. చీరెల తయారీతో చేతినిండా పని, పనికి తగ్గ కూలీతో నెలకు రూ.15వేల నుంచి రూ.20వేలు వచ్చేలా కృషి చేశారు. పాత మరమగ్గాలను ఆధునీకరణ, డాబీల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందించారు. నేతన్నకు చేయూత పథకంలో 5803 మందికి రూ.1.64కోట్లు 10శాతం నూలు వచ్చేలా చేశారు. ఈ పథకంలో ఒక్కో కార్మికుడు రూ.30వేల నుంచి రూ.60వేల వరకు లబ్ధిపొందారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నేతన్నకు బీమా పథకం అమలు చేశారు. చనిపోయిన కుటుంబానికి రూ.5లక్షల బీమాతో భరోసా కల్పించారు. పది మంది చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.50లక్షలు పరిహారం ఎల్ఐసీ నుంచి ఇప్పించి అండగా నిలిచారు.

### నాలుగుసార్లు ఎమ్మెల్యేగా..

రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల ప్రజల ఆకాంక్షలను మంత్రి రామన్న నెరవేరుస్తున్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు గెలిపించారు. పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ మెజార్టీ పెంచుకుంటూ తీర్పునిస్తూ వచ్చారు. 2006లో రాజకీయ అరగేంట్రం చేసిన కేటీఆర్ 2009లో సిరిసిల్ల అభ్యర్థిగా టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయగా, సమీప ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 171ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేసి, తిరిగి 2010లో ఉప ఎన్నికల బరిలో నిలిచారు. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 68,219 ఓట్లతో, 2014లో జరిగిన ఎన్నికల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి కొండూరి రవీందర్‌రావుపై 53,004 ఓట్లతో, 2018లో కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 89వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు గెలిచిన అభ్యర్థిగా రామన్న రికార్డు సృషించారు.

### అందుబాటులోకి ఉన్నత విద్యాసంస్థలు

సిరిసిల్ల నియోజకవర్గంలోని ప్రజలకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. అమత్యుడు రామన్న చొరవతో నియోజకవరగలో జేఎన్టీయూ, మెడికల్ కళాశాల, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఐటీడీఆర్, ఐటీఐ కళాశాల, నర్సింగ్ కళాశాల, గంభీరావుపేట మండల కేంద్రంలో కేజీ టూ పీజీ కళాశాలలు ఏర్పాటు చేశారు.

### వెల్లువెత్తుతున్న అభిమానం

తమ అభిమాన నాయకుడు, ప్రగతి ప్రదాత అమాత్యుడిపై ప్రజల అభిమానం వెల్లువెత్తుతున్నది. జరుగబోయే ఎన్నికల్లో లక్షకు పైగా మెజార్టీతో కేటీఆర్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులతోపాటు ప్రజలంతా పట్టదలతో ఉన్నారు. ఇప్పటికే రామన్నకు మద్దతుగా పలు కులసంఘాలు మద్దతు ఇచ్చాయి. టెక్స్‌టైల్స్ పార్కు, మాక్స్‌సంఘాలు ప్రత్యేకంగా తీర్మానం చేశాయి. తంగళ్లపల్లి మండలంలోని వడ్డెర సంఘం అధ్యక్షుడు దుర్గయ్య ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు ముందుకు వచ్చి మద్దతు తెలిపాయి. తమ అభిమాన నాయకుడి నామినేషన్ ఫీజుకు సైతం రూ.10,116 పార్టీకి అందించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు తమ మద్దతు తెలుపుతున్నారు.